
హ్యాండ్ బాల్ ఇండియా టీమ్ కోచ్ బైరు బాలకృష్ణను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్

క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్

● ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్ ఉందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. మంగళవారం భోలక్‌పూర్‌కు చెందిన హ్యాండ్ బాల్ ఇండియా టీమ్ కోచ్ బైరు బాలకృష్ణ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన ఒపెన్ సెంట్రల్ ఏషియన్ హ్యాండ్ బాల్ చాంపియన్ షిప్ పోటీలలో ఇండియా టీమ్ బ్రౌంజ్ మెడల్ సాధించిన సందర్భంగా ఎమ్మెల్యే ముఠా గోపాల్ బాలకృష్ణను సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తమ నియోజకవర్గానికి చెందిన బాలకృష్ణ భారత టీమ్‌కు కోచ్‌గా వ్యవహరించడం అభినందనీయం అన్నారు. నియోజకవర్గానికి చెందిన యువకులకు సైతం హ్యాండ్ బాల్‌లో ప్రత్యేక శిక్షణ ఇచ్చి దేశ విదేశీ క్రీడల్లో రాణించే విధంగా తీర్చి దిద్దాలని ఆయన కోరారు. కార్యక్రమంలో భోలక్‌పూర్ వాసులు బాబూరావు, కొండల్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.


కలుషిత నీటిని పరిశీలిస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమాదేవి

కలుషిత నీటి సరఫరా నివారణకు చర్యలు

● కార్పొరేటర్ కన్నె ఉమాదేవి

బర్కత్‌పుర, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ డివిజన్‌లో కలుషిత నీటి సరఫరా నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు కార్పొరేటర్ కన్నె ఉమాదేవి తెలిపారు. మంగళవారం డివిజన్ పరిధిలోని నింబోలిఅడ్డలో పాదయాత్ర నిర్వహించగా స్థానికులు నల్లాల్లో వచ్చిన కలుషిత నీటిని కార్పొరేటర్‌కు చూపించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంచినీటి పైప్‌లైన్లకు మరమ్మతులు చేపడుతున్నామన్నారు. అన్ని బస్తీలలో పాదయాత్రలు నిర్వహించి మంచినీటి పైప్‌లైన్లను పరిశీలిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, నాయకులు ఆర్. సంతోష్, మహేష్, రవియాదవ్, బాబన్న, వాసు, లావణ్య తదితరులు పాల్గొన్నారు.


నల్లకుంటలో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న కార్పొరేటర్ అమృత, జీహెచ్‌ఎంసీ అధికారులు

సమస్యల సత్వర పరిష్కారానికి కృషి

● కార్పొరేటర్ యాకర అమృత

నల్లకుంట, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): నల్లకుంట డివిజన్‌లోని పలు ప్రాంతాలలోని సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు కార్పొరేటర్ యాకర అమృత అన్నారు. డివిజన్‌లో పాదయాత్ర చేస్తూ ఆయా సమస్యలపై సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటున్నామన్నారు. మంగళవారం నల్లకుంట డివిజన్‌లోని గోల్నాకలో నాలా, భాగ్యనగర్, బాయమ్మగల్లీలో కార్పొరేటర్ జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి పాదయాత్ర చేసి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఆయా సమస్యలను జీహెచ్‌ఎంసీ అధికారులతో అప్పటికప్పుడే చర్చించి వాటిని వారం, పది రోజుల్లో పూర్తి చేస్తామని కార్పొరేటర్ ప్రజలకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.


మత గురువులను సన్మానించిన బీఆర్‌ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకుడు జునేద్ బాగ్దాదీ, తదితరులు

గురువులను గౌరవించడం మన సంప్రదాయం

● బీఆర్‌ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకుడు జునేద్ బాగ్దాదీ

ముషీరాబాద్, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): సమాజం కోసం పాటుపడే మత గురువులను గౌరవించడం మన సంప్రదాయం అని బీఆర్‌ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకుడు జునేద్ బాగ్దాదీ అన్నారు. మంగళవారం భోలక్‌పూర్ సిద్దిక్ నగర్‌లో ఖురాన్‌లోని వాక్యాలను ప్రజలకు బోధిస్తూ శాంతియుత వాతావరణంలో జీవించేలా కృషి చేస్తున్న మత గురువులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జునేద్ బాగ్దాదీ వారికి శాలువాలు కప్పి పూలమాలలు వేసి సన్మానించి మాట్లాడారు. సమాజ శ్రేయస్సుకోసం కృషి చేస్తున్న వ్యక్తులను ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో భోలక్‌పూర్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్ రావు, నాయకులు రహీం, మహ్మద్ అలీ, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

జాలరులను బెదిరించి డబ్బులు లాక్కున్న రౌడీషీటర్

● ఇర్ఫాన్ కోసం గాలిస్తున్న నార్సింగ్ పోలీసులు

నార్సింగ్, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): చెరువులో చేపలు పట్టుకుంటున్న జాలరును బెదిరించిన ఓ రౌడీషీటర్ వారి వద్ద నగదు లాక్కున్నాడు. నార్సింగ్ పోలీసుల కథనం ప్రకారం.. రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్‌గా నమోదైన ఇర్ఫాన్ సోమవారం రాత్రి స్నేహితులతో కలిసి పీరంచెరువు కట్టపై మద్యం తాగాడు. అదే సమయంలో చెరువులో చేపల వేటకోసం వలలు వేసేందుకు వచ్చిన ఉప్పర్‌పల్లికి చెందిన సందీప్‌కుమార్ అతని సహచరుల వద్దకు ఇర్ఫాన్ ఇతని మనుషులు వెళ్లారు. 'ఇప్పటికే అనేక మర్డర్లు చేశాను. వారం రోజుల క్రితమే జైలు నుంచి వచ్చాను. మిమ్మల్ని చంపి మళ్లీ జైల్‌కు పోతాను' అంటూ ఇర్ఫాన్ కత్తితీసి జాలార్ల ముందు తిప్పడంతో వారికి స్వల్పగాయాలయ్యాయి. జేబులో ఎంత ఉంటే అంత డబ్బులు ఇవ్వాలని ఇర్ఫాన్ డిమాండ్ చేయడంతో సందీప్‌కుమార్ జేబులో ఉన్న రూ.11వేలు ఇర్ఫాన్‌కు ఇచ్చేసి అక్కడి నుంచి పారిపోయారు. తర్వాత పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు వెళ్లి వెతికినా అతడి ఆచూకీ లభించలేదు. గతంలో పీరంచెరువు వద్ద డంకెన్ డ్రైవ్ టెస్టులు జరుగుతున్న సమయంలో ఈ ఇర్ఫాన్ ద్విచక్ర వాహనాన్ని కాల్చివేసి హంగామా సృష్టించాడు. ఈ కేసులో నార్సింగ్ పోలీసులు ఇతడిని అరెస్టు చేసి జైలుకు పంపారు. రౌడీషీటర్ ఇర్ఫాన్ కోసం నార్సింగ్ పోలీసులు గాలిస్తున్నారు.

నేడు మాదక ద్రవ్యాల నివారణ దినోత్సవం

ముషీరాబాద్, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సొసైటీ ఫర్ రూరల్ డవలప్‌మెంట్ (ఎస్ఆర్‌డి) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై యువతీ యువకులకు బుధవారం రాంనగర్‌లోని ఎస్‌ఆర్‌డీ సంస్థ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు సంస్థ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోని తమ జీవితాలు నాశనం కాకుండా జాగ్రత్త వహించాలి అన్నారు.

రెండు దశాబ్దాల క్రితం ఫౌండేషన్..
ఇప్పుడు నిర్మాణం..!

- గగన్‌మహల్ - చిక్కడపల్లి దారిలో దోమలగూడ నాలాపై బ్రిడ్జి నిర్మాణం
- ప్రారంభమైన పనులు
- స్థానికుల అభ్యంతరం.. సహకరించాలంటున్న అధికారులు


దోమలగూడ నాలాపై ప్రారంభమైన బ్రిడ్జి పనులు

హైదరాబాద్ సిటీ, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): రెండు దశాబ్దాల క్రితం శంకుస్థాపన చేసిన బ్రిడ్జి పనులు ఎట్టకేలకు ఇటీవల ప్రారంభమయ్యాయి. వేలాది మంది వాహనదారులకు ఉపయుక్తంగా ఉండి కిలోమీటర్ల మేర దూరాభారం తగ్గే ప్రాజెక్టు పట్టాలెక్కింది. గగన్‌మహల్ నుంచి అశోక్‌నగర్, నగర కేంద్ర గ్రంథాలయం మీదుగా చిక్కడపల్లి వైపునకు వెళ్లేందుకు దోమలగూడ నాలాపై బ్రిడ్జి నిర్మాణ పనులను జీహెచ్‌ఎంసీ చేపట్టింది రూ.4 కోట్లతో 42 మీటర్ల మేర రెండు లేన్లుగా నాలాపై బ్రిడ్జి నిర్మిస్తున్నారు. కొన్నాళ్ల క్రితం పనులు ప్రారంభం కాగా.. ఆరు నెలల్లో పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు.

దోమలగూడ నాలాపై బ్రిడ్జి నిర్మించాలని రెండు దశాబ్దాల క్రితం నిర్ణయించారు. హైదరాబాద్ మేయర్‌గా తీగల కృష్ణారెడ్డి ఉన్న సమయంలో రూ.98 లక్షలకు పైగా అంచనా వ్యయంతో బ్రిడ్జి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. పలు కారణాలతో పనుల్లో ముందడుగు పడలేదు. అప్పటి నుంచి పెండింగ్‌లో ఉన్న బ్రిడ్జి నిర్మాణాన్ని తాజాగా జీహెచ్‌ఎంసీ ప్రారంభించింది. బ్రిడ్జి అందుబాటులోకి వస్తే.. లిబర్టీ నుంచి గగన్‌మహల్, నగర కేంద్ర గ్రంథాలయం మీదుగా నేరుగా చిక్కడపల్లి, బాగ్‌లింగంపల్లి, నల్లకుంట, తిలక్ నగర్ తదితర ప్రాంతాలకు వెళ్లే వెసులుబాటు ఉంటుంది. ప్రస్తుతం నాలా అడ్డుగా ఉండడంతో ఆ మార్గంలో వెళ్లాల్సిన వారు హిమాయత్‌నగర్ లేదా ఇందిరాపార్కు, అశోక్‌నగర్ మీదుగా తిరిగి వెళ్లాల్సి వస్తోంది. బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే కిలోమీటరున్నర నుంచి రెండు కిలోమీటర్ల మేర దూరం తగ్గుతుంది. హిమాయత్‌నగర్-నారాయణగూడ, ఇందిరా పార్కు- ఆర్టీసీ క్రాస్‌రోడ్డు మార్గాల్లోని రహదారులపైనా ట్రాఫిక్ ఒత్తిడి తగ్గనుంది.

స్థానికుల అభ్యంతరం...

బ్రిడ్జి నిర్మాణంపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. వరద ప్రవాహం ఎక్కువగా వస్తే పరిసర ప్రాంతాలు మునుగుతాయని ఆందోళన చెందుతున్నారు. ఇటీవల సూరజ్‌నగర్ బస్తీ వాసులు పనులు నిలిపివేయాలని ధర్నా చేశారు. అధికారులు మాత్రం.. ముంపు ముప్పు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకొని బ్రిడ్జి నిర్మిస్తున్నామని చెబుతున్నారు. ప్రజలకు ఉపయుక్తంగా ఉండనున్న దృష్ట్యా.. సహకరించాలని కోరుతున్నారు.


ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలియజేస్తున్న ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కృష్ణగౌడ్

కార్పొరేషన్ ఎన్నికలకు సిద్ధం కావాలి

● ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్

రాంనగర్, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు ప్రతి కార్యకర్త సైనికులుగా పనిచేసి రాబోయే కార్పొరేషన్ ఎన్నికలకు సిద్ధం కావాలని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేస్తున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఆరు గ్యారంటీలను ప్రజలకు తెలియజేస్తూ కాంగ్రెస్ పార్టీ వైపు ప్రజలను ఆకర్షితులను చేయాలని సూచించారు. స్థానిక సమస్యలను తెలుసుకుని వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేయాలన్నారు. మంగళవారం ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి తొలుపునూరి కృష్ణగౌడ్ కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా దానం మాట్లాడుతూ పార్టీ కోసం అంకితభావంతో పనిచేసే కార్యకర్తలకు దశల వారీగా పార్టీ, నామినేటెడ్ పదవులు లభిస్తాయని అన్నారు. కృష్ణగౌడ్ మాట్లాడుతూ ఖైరతాబాద్ పరిధిలో పార్టీని పటిష్టం చేయడానికి సైనికుడిగా పనిచేస్తానన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి మాజీ చైర్మన్ జి. నాగభూషణం నాయకులు దిలీప్, శ్రీమంత్‌గిరి, నరేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ

బహుజన రాజ్యాధికార సాధనకు ప్రతి ఒక్కరు పాటుపడాలి

రాంనగర్, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): బహుజన సాహిత్యం ద్వారానే రాజ్యాధికారం సిద్ధిస్తుందని బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ అన్నారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బహుజన సాహిత్య అకాడమీ 7వ రాష్ట్ర సదస్సు జరిగింది. ఈ సదస్సులో నల్లా రాధాకృష్ణ మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బీ. ఆర్. అంబేడ్కర్, కాన్షీరామ్‌లు కలలుగన్న బహుజన రాజ్యాధికారం సాధనకు ప్రతి ఒక్కరు పాటుపడాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో బహుజన సాహిత్యం వ్యాప్తి చేసేందుకు తాము చేస్తున్న ప్రయత్నంలో అందరు భాగస్వామ్యులు కావాలని కోరారు. గౌరవ అతిథిగా హాజరైన ప్రముఖ కవి, గాయకుడు దరువు ఎల్లన్న మాట్లాడుతూ బహుజన సాహిత్య అకాడమి దేశంలోని 27 రాష్ట్రాలు, ఏడు దేశాల్లో విస్తరించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సంస్థ జాతీయ కార్యదర్శి ఎర్రగుంట్ల వెంకటేశ్వర్, ఏపీ ఇన్‌చార్జి పి.ఎస్. వరప్రసాద్, రాష్ట్ర సభ్యులు శ్రీనివాస్‌గౌడ్, మామిడిపల్లి షాపయ్య, తాటికంటి ఐలయ్య, బాదే వెంకటేశం, రాజలింగం, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

మంత్రివర్గ విస్తరణలో బీసీలకు ఐదు మంత్రి పదవులు ఇవ్వాలి

నామినేటెడ్ పోస్టులలో సంగం ఇవ్వాలి : ఆర్. కృష్ణయ్య

బర్కత్‌పుర, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): త్వరలో చేపట్టనున్న రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో బీసీలకు 5 మంత్రి పదవులు ఇవ్వాలని రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో ప్రస్తుతం ఇద్దరు బీసీ మంత్రులు ఉన్నారని ఇది అన్యాయమని అన్నారు. నామినేటెడ్ పోస్టులలో 50 శాతం కోటా బీసీలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్.కృష్ణయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. బీసీ కులాల్లో అత్యధిక జనాభా కలిగిన కురుమ గొల్లలు, ముదిరాజ్, మున్నూరుకాపు, విశ్వబ్రాహ్మణ, రజక, నాయీబ్రాహ్మణ, వడ్డెర, బలిజ తదితర కులాలకు ప్రాతినిధ్యం లేదని, ఈ కులాలకు మంత్రివర్గ విస్తరణలో ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.

కార్పొరేషన్‌లు, ప్రభుత్వ రంగ సంస్థలలో చైర్మన్, డైరెక్టర్ పోస్టులలో బీసీలకు 50 శాతం కోటా ఇవ్వాలన్నారు. అన్ని బీసీ కులాలకు కార్పొరేషన్లను ఏర్పాటు చేసి పాలక మండలి నియమించాలని డిమాండ్ చేశారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఆర్. కృష్ణయ్య

ఈ విద్యా సంవత్సరం వంద బీసీ గురుకుల పాఠశాలలు, 50 ఇంజనీరింగ్ కాలేజీలు, రెండు యూనివర్సిటీలను కొత్తగా ఏర్పాటు చేయాలని కోరారు. కాలేజీ కోర్సులు చదివే బీసీ విద్యార్థులకు పూర్తి ఫీజు ప్రభుత్వమే చెల్లించాలని, బీసీ కులాల జనాభా లెక్కలు ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే చేపట్టాలని, పంచాయతీరాజ్ రిజర్వేషన్లను జనాభా ప్రకారం పెంచాలన్నారు. సమావేశంలో బీసీ సంఘాల నేతలు చిల్లంపల్లి రమేష్, టి.నంద గోపాల్, వేముల రామకృష్ణ, కోటేశ్వరీ, మేడి రాందేవ్, అమృత, ఉమ, చిరంజీవిగౌడ్, ఆశిష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా తిరుగుతున్న ఐదుగురికి జైలు

చాంద్రాయణగుట్ట, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): అర్ధరాత్రి రోడ్లపై అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తులకు నాంపల్లిలోని 9వ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ఐదు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చిందని ఫలక్‌నుమా పోలీసులు తెలిపారు. జహనుమాకు చెందిన మహ్మద్ జాకీర్, వట్టేపల్లికి చెందిన షేక్ మొయినుద్దీన్, ఛత్రినాక కందికల్‌గేట్‌కు చెందిన ఎజాజ్‌ఖాన్,ఫాతిమానగర్‌కు చెందిన మహ్మద్ ఆజం, మహ్మద్ ఆసిఫ్ రెండురోజుల క్రితం అర్ధరాత్రి రోడ్లపై అనుమానాస్పదంగా తిరుగుతూ పోలీసులకు కనిపించారు.

వారిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసిన పోలీసులు కోర్టులో హాజరుపరిచారు. పూర్వపరాలు పరిశీలించిన న్యాయమూర్తి నిందితులకు ఐదు రోజులు జైలు శిక్ష విధించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

జాకీర్ అలీ హత్య కేసులో ఇద్దరి రిమాండ్


చాంద్రాయణగుట్ట, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): ఫలక్‌నుమా పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల జరిగిన జాకీర్ అలీ హత్య కేసులో నిందితులు ఇద్దరిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించామని ఫలక్‌నుమా ఏసీపీ బి.యాదగిరి స్వామి తెలిపారు. మంగళవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. హసన్‌నగర్ షోయబ్ కాలనీకి చెందిన జాకీర్ అలీ(29) డ్రైవర్. అచ్చిరెడ్డినగర్‌కు చెందిన ఓ వివాహితతో ఐదు సంవత్సరాలుగా వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. ఆ వివాహిత కూతురిపై కూడా కన్నేశాడు. దీంతో ఆ మహిళ ఎన్నిసార్లు వారించినా వినకపోవడంతో సికింద్రాబాద్ ఈస్ట్ మారేడ్‌పల్లికి చెందిన మహ్మద్ షఫీ(31)కి విషయం తెలిపింది. షఫీ కూడా నచ్చజెప్పినా వైఖరి మార్చుకోలేదు. ఇదిలా వుండగా ఈనెల 21న జాకీర్ అలీ మహిళ ఇంటికి వెళ్లాడు. అప్పటికే మహిళ ఇంట్లో ఉన్న మహ్మద్ షఫీ, వివాహిత భర్త మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. క్షణికావేశంలో షఫీ ఇనుపరాడ్‌తో తలపై కొట్టడంతో జాకీర్ అలీ స్పృహ తప్పిపడిపోయాడు. చనిపోయాడో లేదో అని షఫీ, వివాహిత భర్త కలిసి జాకీర్ అలీకి స్కిప్పింగ్ తాడుతో ఉరివేశారు. ఈ కేసులో మహ్మద్ షఫీ, వివాహిత భర్తను అరెస్టు చేశామని, వివాహిత పరారీలో ఉన్నదని ఏసీపీ తెలిపారు. ఈ సమావేశంలో ఫలక్‌నుమా ఇన్‌స్పెక్టర్ ఆదిరెడ్డి, ఎస్ఐ మహేశ్ తదితరులు పాల్గొన్నారు.



వివరాలను వెల్లడిస్తున్న ఫలక్‌నుమా ఏసీపీ యాదగిరి స్వామి

మత్తు ఇంజెక్షన్‌లు కలిగి ఉన్న వ్యక్తి అరెస్ట్


హైదరాబాద్ సిటీ, జూన్ 25(ఆంధ్రజ్యోతి): అక్రమంగా మెఫెంటర్ మైన్ మత్తు ఇంజక్షన్‌లు కలిగి ఉన్న వ్యక్తిని సీసీఎస్, డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు సంయుక్తంగా అరెస్టు చేశారు. బండ్లగూడకు చెందిన షా ఫహాజ్ షాప్‌కీపర్‌గా పనిచేస్తున్నాడు. అనస్తీషియాలో భాగంగా మత్తును కలిగించే ఇంజెక్షన్‌లు డాక్టర్‌ల సూచన మేరకు పేషంట్స్‌కు ఇవ్వాల్సి ఉంటుంది. వాటిని డాక్టర్స్ సలహాలేకుండా ఇతరులు వాడటానికి వీల్లేదు. అలాంటి మత్తుఇంజక్షన్లు షా ఫహాజ్ వద్ద 190 వరకు ఉన్నట్లు డ్రగ్ కం ట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులకు విశ్వసనీయ సమాచారం అందింది. సీసీఎస్ స్పెషల్ జోనల్ క్రైమ్ టీమ్ ఇన్‌స్పెక్టర్ భిక్షపతి బృందం సహకారంతో దాడిచేసి నిందితుడిని అరెస్టు చేశారు. స్వాధీనం చేసుకున్న ఇంజెక్షన్‌లను చార్మినార్ జోన్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌కు అప్పగించారు.


స్వాధీనం చేసుకున్న మెఫెంటర్‌మైన్ ఇంజెక్షన్‌లు

దేశవ్యాప్తంగా రైతు రుణమాఫీ చట్టం తీసుకురావాలి

జూలై 10న ఢిల్లీలో సంయుక్త కిసాన్‌మోర్చా జాతీయ సమావేశం

బర్కత్‌పుర, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): స్వామినాథన్ కమిషన్ సిఫార్సులకు అనుగుణంగా మద్దతు ధర గ్యారంటీ చట్టాన్ని పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి దేశవ్యాప్తంగా అమలు చేయాలని, దేశవ్యాప్తంగా రైతు రుణమాఫీ చట్టం తీసుకురావాలని మాజీ ఎంపీ వడ్డే శోభనాద్రీశ్వరరావు, సంయుక్త కిసాన్‌మోర్చా ప్రతినిధులు వీస్సా కిరణ్‌కుమార్, టి.సాగర్, మురళీధర్‌రెడ్డి, కన్నెగంటి రవి, మండల వెంకన్న, జక్కుల వెంకటయ్య డిమాండ్ చేశారు. రాష్ట్రాలు ఇస్తున్న రుణమాఫీలో సగం కేంద్ర ప్రభుత్వం భరించాలని వారన్నారు. రైతులు పండించిన అన్నిరకాల పంటలకు మద్దతు ధరలు ప్రకటించి కొనుగోలు గ్యారంటీ చేయాలని కోరారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రధాని మోదీ కార్పొరేట్ శక్తులకు రూ.16 లక్షల కోట్లు మాఫీ చేశారని, రైతు రుణాలను మాత్రం మాఫీ చేయలేదని విమర్శించారు. పదేళ్ల మోదీ పాలనలో దేశవ్యాప్తంగా 1.09 లక్షల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని వారు గుర్తుచేశారు. తాము అధికారంలోకి వస్తే స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను పూర్తిస్థాయిలో అమలు చేస్తామని, రైతులను ఆదుకుంటామని ప్రగల్భాలు పలికిన ప్రధాని మోదీ ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదని వారు ఆరోపించారు. 2017లో మధ్యప్రదేశ్‌లో ఉల్లి రైతులపై కాల్పులు జరిపించి ఆరుగురు రైతుల ప్రాణాలను బలికొన్న శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను కేంద్ర వ్యవసాయశాఖ మంత్రిగా నియమించడం అత్యంత దుర్మార్గమని, ఆయనను వెంటనే ఆ పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఆగస్టులోగా రైతులకు రుణమాఫీ అమలు చేస్తామని రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామని, ఒకే విడతలో రుణమాఫీ చేయాలని కోరారు. వ్యవసాయ రైతులు బలంగా ఉన్న రాష్ట్రాలలో ఎంపీ ఎన్నికల్లో బీజేపీకి గుణపాఠం చెప్పారని, ఇప్పటికైనా మోదీ ప్రభుత్వం రైతువ్యతిరేక విధానాలను విడనాడకపోతే రైతుల తిరుగుబాటు తప్పదని వారు హెచ్చరించారు. రైతుల ఉద్యమాన్ని బలోపేతం చేయడానికి ప్రధాని మోదీ కళ్లు తెరిపించడానికి జూలై 10న ఢిల్లీలో సంయుక్త కిసాన్‌మోర్చా జాతీయ సమావేశం నిర్వహిస్తున్నామని, దీనిలో దేశవ్యాప్తంగా రైతు సంఘాల నేతలు పాల్గొని ఉద్యమకార్యాచరణ రూపొందిస్తారని వారు తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ వడ్డే శోభనాద్రీశ్వరరావు


మాజీ ప్రధాని స్వర్గీయ వీపీ సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్, తదితరులు

రిజర్వేషన్లపై పార్లమెంటులో ప్రధాని ప్రకటన చేయాలి

● జాజుల శ్రీనివాస్‌గౌడ్

కవాడిగూడ, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంటు సమావేశాల్లో దేశంలో సామాజిక రిజర్వేషన్లపై ప్రధాని నరేంద్రమోదీ స్పష్టమైన విధాన ప్రకటన చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని ఇందిరాపార్కు చౌరస్తాలో ఉన్న బీసీ భవన్ కార్యాలయంలో ఓబీసీలకు ఉద్యోగ రంగంలో 27శాతం రిజర్వేషన్లను కల్పించిన మాజీ ప్రధాని, స్వర్గీయ వీపీ సింగ్ (విశ్వనాథ ప్రతాప్‌సింగ్) 93వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి జాజుల శ్రీనివాస్ గౌడ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన జయంతి సభలో జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ఇటీవల పాట్నా హైకోర్టు ఇచ్చిన తీర్పుపై ఢిల్లీలో అఖిలపక్ష రాజకీయ పార్టీల సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. ప్రధాని మోదీ బీసీలకు జరిగిన అన్యాయాన్ని గ్రహించి దేశవ్యాప్తంగా బీసీ కులగణన చేపట్టి జనాభా దమాషా ప్రకారం బీసీలకు 50శాతం రిజర్వేషన్లు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ విజయ్ భాస్కర్, బీసీ నేతలు బూడిద మల్లికార్జునయాదవ్, పానుగంటి విజయ్, మాదేశీ రాజేందర్, వీరమల్ల కార్తీక్, ప్రవీణ్‌యాదవ్, జాజుల భాస్కర్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

రాత్రి 11 తరువాత షాపులు తెరిస్తే చర్యలు

● గాంధీనగర్ సీఐ రాజు



కవాడిగూడ, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): నగరంలో శాంతి భద్రతల పరిరక్షణ నేపథ్యంలో ప్రతి రోజు రాత్రి 11 గంటల తరువాత షాపులు, వ్యాపార కేంద్రాలు తెరిచి ఉంటే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని గాంధీనగర్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రాజు హెచ్చరించారు. రాత్రి 11 గంటల నుంచి ఉదయం ఐదు గంటల వరకు ఎవరైనా వాహనాలపై అకారణంగా సంచరించినా, ఎక్కడపడితే అక్కడ గుమికూడినా వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు కేసులు నమోదు చేస్తామని ఆయన తెలిపారు. నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాల మేరకు నగరంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం కఠిన చర్యలు తీసుకోడం జరుగుతుందని ఆయన తెలిపారు. మంగళవారం సీఐ రాజు విలేకరులతో మాట్లాడుతూ గాంధీనగర్ పీఎస్ పరిధిలోఉన్న హోటళ్లు, పాన్‌షాపులు, బిర్యానీ హోటళ్లు, కిరాణా షాపులు ఎవరైనా 11 గంటల తరువాత తెరిచిఉంటే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

మెగా డీఎస్సీ ద్వారా ఖాళీలు భర్తీ చేయాలి

చిక్కడపల్లి, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం మెగా డీఎస్సీ ద్వారా 24 వేల ఖాళీలు భర్తీ చేయాలని తెలంగాణ బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్, కో ఆర్డినేటర్ దశరథం కోరారు. మంగళవారం సాయంత్రం చిక్కడపల్లిలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలని, ప్రయివేట్ కార్పొరేట్ స్కూళ్లలో ఫీజుల నియంత్రణ చట్టం తేవాలని కోరారు. ప్రయివేట్ స్కూళ్లలో బుక్స్, యూనిఫారమ్‌లు అమ్మకాలపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కళాశాలల్లో చదివే బీసీ విద్యార్థులకు అందరికి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం అమలు చేయాలని కోరారు. సమావేశంలో ఐక్యవేదిక గ్రేటర్ కన్వీనర్ రాజేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న జయరాములు, జయసూర్య

'సాధికార వ్యాసాలు రాసిన తిరుమల రామచంద్ర'

చిక్కడపల్లి, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): మాండలికాలు పదప్రయోగాల్లో గుణదోషాలపై తిరుమల రామచంద్ర సాధికార వ్యాసాలు రాశారని ప్రముఖ సాహితీవేత్త ఆచార్య జయరాములు, జర్నలిస్టు జయసూర్య, రామచంద్ర భాషా శాస్త్రవేత్త అన్నారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో మంగళవారం ఎందరో మహానుభావులు కార్యక్రమంలో భాగంగా తిరుమల రామచంద్ర యాదిలో కార్యక్రమం గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జయసూర్య మాట్లాడుతూ రామచంద్ర ఆంధ్రపత్రికలో ఎన్నో ప్రయోజనాత్మక వ్యాసాలు రాశారని వివరించారు. జయరాములు మాట్లాడుతూ భాషా శాస్త్ర పరిశోధనలో అగ్రగణ్యులు రామచంద్ర అని వారి రచనలు అందుబాటులోకి తేవాలని సూచించారు. గానసభ పాలకవర్గ సభ్యురాలు గీతాదేవి పాల్గొన్నారు.

అపార్ట్‌మెంట్ నిర్మాణాల నిబంధనను వెల్లడించాలి

చిక్కడపల్లి, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ రాంకీ సంస్థకు ఇచ్చిన అపార్ట్‌మెంట్ నిర్మాణాల నిబంధనను వెల్లడించాలని వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి డిమాండ్ చేశారు. మంగళవారం సాయంత్రం ఆయన గోల్కొండ చౌరస్తాలోని మండలి రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. రాంకీ సంస్థకు ఇచ్చిన అపార్ట్‌మెంట్ నిర్మాణాలలో ఈడబ్ల్యుఎస్ (ఎకనమికల్లీ వీకర్ సెక్షన్స్)కు కేటాయించిన కోటా ఎంతో తెలపాలని డిమాండ్ చేశారు. అసలైన, అర్హులైన పేదలకు కేటాయించిన తర్వాతనే ఇతరులకు అపార్ట్‌మెంట్లు రిజిస్ట్రేషన్ చేయాలని ఆయన కోరారు. ఆజంజాహి మిల్లు భూముల ఉపాధి ఉద్దేశం తద్వారా నెరవేరాలని చక్రపాణి అన్నారు. దక్షిణాది రాష్ట్రాల ప్రధాన కార్యదర్శి పల్లెపాడు దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న గానవిభావరి

చిక్కడపల్లి, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): అల్లంచాయ్ కల్చరల్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన గానవిభావరి ఆకట్టుకుంది. మంగళవారం సాయంత్రం ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని కళాభారతి సిటీ కల్చరల్ సెంటర్ హాల్-1లో జరిగిన పాడుకుందాం రండి(విందు-వినోదం) పేరిట నిర్వహించిన కార్యక్రమంలో గాయనీగాయకులు చింతలపూడి త్రినాథరావు, సుబ్రహ్మణ్యం, వివేకానంద, కల్లేపల్లి మోహన్, అనురాధ, రేవతి, శ్రీదేవి తదితరులు ఎంపిక చేసుకున్న గీతాలు మధురంగా ఆలపించారు. నిర్వాహకులు గొర్తి చంద్రశేఖర్ గాయనీగాయకులను అభినందించారు.